# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 25, జనవరి 2026




## బాలికలు అన్ని రంగాలలో రాణిస్తూ ఉన్నత స్థాయిలో నిలువాలి

● మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జనవరి 24, ప్రభాతవార్త

బాలికలు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, అందరికీ ఆదర్శంగా నిలువాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్, జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. బాలికలను రక్షి ద్దాం  బాలికలను చదివిద్దాం కార్యక్రమంలో భాగంగా బాలికల సంరక్షణ కొరకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని, బాలికలకు అవకాశం ఇస్తే అన్ని రంగాలలో అద్భుతంగా ఆకాశాన్ని అందుకుంటారని అన్నారు. భ్రూణహత్యల నివారణ, బాల్యవివాహాల నియంత్రణ చర్యల ద్వారా బాలికలను రక్షించుకొని అణిచివేతకు గురి కాకుండా ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని, బాలికలకు జీవించే హక్కు, రక్షణ హక్కు, అభివృద్ధి హక్కు, భాగస్వామ్య హక్కు లాంటి ఎన్నో హక్కులను కల్పించడం జరిగిందని తెలిపారు. బాలికల రక్షణ కొరకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు వెళ్ళాలని తెలిపారు. బేటి బచావో  బేటి పడావో ద్వారా మిగతా 2లో..




## దేశ భవిష్యత్ నిర్మాణం విద్యాలయాల్లో..: మంత్రి వివేక్

రామకృష్ణాపూర్, జనవరి 24, ప్రభాతవార్త

దేశ భవిష్యత్ నిర్మాణం విద్యాలయాల్లో జరుగుతుందని, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శనివారం పట్టణంలోని అల్ఫోన్సా కాన్వెంట్ హై స్కూల్‌లో పాఠశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించగా ఆయన ముఖ్య అతిగా అద్యక్షులుగా ఆదిలాబాద్ బిషప్ రైట్ రెవెరెంట్ బి.పి జోసఫ్ తచ్చపరంబాత్, అతిధులుగా రెవెరెంట్ ఫాదర్ బినోయ్ మాథ్యూ పారిష్ ప్రీస్ట్,రెవెరెంట్ సిస్టర్ నోబెల్ అసిస్టెంట్ ప్రావిన్సియల్ సుపీరియర్ నిర్మలా ప్రావిన్స్, అల్ఫోన్సా పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ షీనా టామ్,ప్రిన్సిపాల్ సిస్టర్ బెస్సీ హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం పాఠాలతో పాటు, మంచి చెడు విషయాలు గ్రహించాలని అన్నారు. ఉత్తమ భవిష్యత్ నిర్మాణానికి సోపనాలు పాఠశాల స్థాయి నుండే వేసుకోవాలని అన్నారు. గురువులతో పాటు, తల్లిదండ్రులు అహర్నిశలు కృషి చేస్తేనే ఉత్తమ పౌరులుగా విద్యార్థులు రూపాంతరం చెందుతారని అన్నారు. విద్యార్థులు కఠిన శ్రమ చేసి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని విద్యార్థులు మొబైల్ వాడకం తగ్గించి, పుస్తక పఠనము చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలి

- పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ కె.హరిత
- జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

కాగజ్‌నగర్ రూరల్, జనవరి 24, ప్రభాతవార్త :

2026 వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామంలో గల తెలంగాణ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి మెనూ పట్టిక, విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, ఆహారం తయారీకి వినియోగించే కూరగాయలు, నిత్యవసర మిగతా 2లో..



## ఆన్‌లైన్ బెట్టింగ్ నష్టాలతో వ్యక్తి ఆత్మహత్య

సారంగాపూర్, జనవరి 24, ప్రభాతవార్త:



సారంగాపూర్ మండలంలో చించోలి(బి) శివారు ప్రాంతంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ప్రకారం నిర్మల్ మండలం రానాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ ప్రేమ్ కుమార్(39) ఆన్లైన్ బెట్టింగ్‌లో లక్షల రూపాయలు నష్టపోయి నట్లు తెలిపారు. అలాగే ఫర్టిలైజర్ వ్యాపారంలో కూడా నష్టం రావడంతో తీవ్ర మనస్థాపానికి గురైనట్లు మిగతా 2లో..

## వ్యవసాయ పరికరాలతో రైతులకు సాగు సులభతరం

● మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాల, జనవరి 24, ప్రభాతవార్త

వ్యవసాయ సాగులో రైతులకు ఉపయోగకరమైన వ్యవసాయ పరికరాలతో సాగు సులభతరం అవుతుందని మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో జిల్లా వ్యవసాయ అధికారిని సురేఖ, మంచిర్యాల ఏఎంసి చైర్మన్ పయ్యావుల పద్మ ముని, ఆత్మ బిఎఫ్ఏసి చైర్మన్ సింగటి మురళి, సహాయ వ్యవసాయ సంచాలకులు మంచిర్యాల డివిజన్ ఎం.కృష్ణలతో కలిసి అర్హులైన రైతులకు మిగతా 2లో..



## బాలికలు అన్ని రంగాలలో రాణిస్తూ ఉన్నత స్థాయిలో నిలువాలి

**(మొదటిపేజీ తరువాయి)**

భ్రూణహత్యలను నియంత్రించి ఆడపిల్లల లింగ నిష్పత్తిని పెంచడం జరిగిందని, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల ద్వారా తెలంగాణలో బాలిక విద్యను ప్రోత్సహించడంతో పాటు పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా క్యాంటీన్లు, వివిధ వ్యాపారాలలో మహిళ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. బెల్లంపల్లి శాసనసభ్యులు మాట్లాడుతూ బాలికలు సమాజంలో జరుగుతున్న ప్రతి అంశాన్ని తెలుసుకోవాలని, ప్రతి విషయంలో నైపుణ్యం పెంపొందించుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం జాతీయ బాలిక దినోత్సవం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. బేటి బచావో భేటీ పడావో ప్రతిజ్ఞ చేశారు. చదువుతో పాటు క్రీడలు, నృత్యాలు, సాంస్కృుతిక కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన బాలికలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పరికరాలతో రైతులకు సాగు సులభతరం

**(మొదటిపేజీ తరువాయి)**

వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గాను సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజెషన్‌లో భాగంగా ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై రైతులకు వ్యవసాయ పరికరాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా పథకాలను అమలు చేయడంతో పాటు వరి ధాన్యం, పత్తి, మొక్కజొన్న పంటలను కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి కొనుగోలు చేస్తూ రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో 35 లక్షల 31 వేల రూపాయల విలువైన 6 పవర్ టిల్లర్లు, 6 రోటవేటర్లు, 52 పవర్ స్ప్రేయర్లు, 16 బ్రష్ కట్టర్లను జిల్లాలోని దండేపల్లి, హాజీపూర్, లక్షెట్టిపేట మండలాలకు చెందిన 81 మంది అర్హులైన రైతులకు 16లక్షల 24 వేల రూపాయల రాయితీతో పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ నష్టాలతో వ్యక్తి ఆత్మహత్య

**(మొదటిపేజీ తరువాయి)**

చెప్పారు. ఈ క్రమంలో చించొలి(బి) శివారులోని మైనారిటీ పాఠశాల సమీపంలో బ్లేడ్‌తో చేతి మణికట్టుపైన కోసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సంఘటన స్థలంలో పురుగుల మందు డబ్బా కూడా లభించినట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి జాదవ్ తారచంద్ ఇచ్చిన దరఖాస్తు ప్రకారం ప్రేమ్ కుమార్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు. కొన్ని నెలల క్రితం వ్యాపారంలో నష్టం రావడంతో డబ్బుల కోసం ఆన్లైన్ బెట్టింగ్ వైపు వెళ్లి సుమారు 70 లక్షల రూపాయల వరకు నష్టపోయినట్లు పేర్కొన్నారు. ఈ కారణాలతో తీవ్రంగా కలత చెందిన ప్రేమ్ కుమార్ నిన్న మధ్యాహ్నం నుంచి కనిపించలేదని, వెతికిన అనంతరం శనివారం ఉదయం మృతదేహం గుర్తించినట్లు తెలిపారు. దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి, నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

సరుకుల నాణ్యత పరిశీలించి పాఠశాల ప్రిన్సిపల్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆహారం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలను పాటించాలని తెలిపారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షించాలని, పాఠశాల పరిసరాలలో పరిశుద్ధ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. తరగతి గదులను సందర్శించి విద్యా బోధన విధానం, మెనూ ప్రకారం భోజనం అమలు అంశాలపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, 10వ తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని, సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులు గైర్హాజరు లేకుండా చూడాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు అందించవలసిన పండ్లు అందించకపోవడంపై సంక్షేమ అధికారిని అడుగగా సంబంధిత గుత్తేదారు సరఫరా చేయడం లేదని తెలపడంతో సదరు గుత్తేదారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సకాలంలో నాణ్యమైన పండ్లను సరఫరా చేయాలని, సంబంధిత సమాచారాన్ని తనకు అందించాలని ఆదేశించారు. గురుకులానికి ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించి ఇంజనీరింగ్ అధికారులతో అంచనా ప్రతిపాదనల రూపొందించి ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చదువుతోనే ఉన్నత శిఖరాలు సాధ్యం....

**- కాగజ్‌నగర్ డీఎస్పీ వహీవద్దీన్**

కాగజ్‌నగర్, జనవరి 24, ప్రభాతవార్త :

చదువుతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని కాగజ్‌నగర్ డీఎస్పీ వహీవద్దీన్ అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని స్థానిక అన్వర్ ఉర్దూ పాఠశాలలో అబిద్ అలీఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా సియాసత్ క్వశ్చన్ బ్యాంక్, ఎగ్జామ్ ప్యాడ్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ వహీవద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొని అన్వర్ ఉర్దూ పాఠశాల, ఎగ్బాల్ స్కూల్, ప్రభుత్వ పాఠశాల, ఆర్.బి పాఠశాలలకు చెందిన ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు క్వశ్చన్ బ్యాంక్ ఎగ్జామ్ ప్యాడ్ లను అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటపాటలతో పాటు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి, తల్లిదండ్రులకు, సిర్పూర్ నియోజకవర్గానికి, రాష్ట్రస్థాయిలో మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అలాగే గతంలో పదో తరగతి ఉర్దూ మీడియం పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు కూడా అబిద్ అలీఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సియాసత్ క్వశ్చన్ బ్యాంక్‌లు అందజేయడం అభినందనీయమని తెలిపారు. విద్యరంగ అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అందిస్తున్న మార్గదర్శనం, తల్లిదండ్రుల సహకారం వల్ల మంచి ఫలితాలు సాధించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యతోనే భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని, ప్రతి విద్యార్థి లక్ష్యసాధనతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ కుమారస్వామి,అన్వర్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు ఆరిఫ్ ఉద్దీన్, ట్రస్ట్ జిల్లా ఇంచార్జ్ అబ్దుల్ జమీల్,కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు తాటి రవీందర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు క్వశ్చన్ బ్యాంక్, ఎగ్జామ్ ప్యాడ్‌లను అందచేస్తున్న డీఎస్పీ,ఎంఈఓ, సీఐ

## ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

లక్షెట్టిపేట, జనవరి 24, ప్రభాతవార్త

16 వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రోజున ప్రభుత్వ డిగ్రీ కళాశాల లక్షెట్టిపేటలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహాత్మా సంతోష్ అధ్యక్షతన, రాజనీతి శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి జాతీయ ఓటరు దినోత్సవ అవగాహన ర్యాలీ, ఓటరు ప్రతిజ్ఞ, విద్యార్థుల పోటీలు ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం కళాశాలలో ప్రజాస్వామ్యంలో మహిళా ఓటర్ల పాత్ర అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి లక్షెట్టిపేట తహసిల్దార్ దిలీప్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు అవగాహన కలిగి ఉండటం ముఖ్యమని సూచించారు. ప్రజాస్వామ్యానికి ఓటు ఒక బలం అని పేర్కొన్నారు. అనంతరం తహశీల్దార్, ప్రిన్సిపాల్ చేతుల మీదుగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి సంధ్యారాణి, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ టి సురేష్, అధ్యాప బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మ జాతరకు ముమ్మర ఏర్పాట్లు

**- జాతర నిర్వహణ కమిటి అధ్యక్షుడు తుమ్మ రమేష్**

కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ మండలంలోని మున్సిపల్ పంపు హౌస్ నందిగుడా పరిధిలో ఈనెల 28 నుండి 31వ తేదీ వరకు నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరకు నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు జాతర నిర్వహణ కమిటి అధ్యక్షుడు తుమ్మ రమేష్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి కుటుంబ సమేతంగా వేలాదిగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున భక్తుల సౌకర్యార్థం ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం భక్తుల సౌకర్యార్థం మంచినీటి నల్లాలతో పాటు జాతర ప్రాంతలో మట్టి పోసి చదును చేసి శుభ్రం చేయించినట్లు తెలిపారు. సమ్మక్క సారలమ్మ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు మొక్కలు చెల్లించి దీవెనలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పోలోజు శ్రీనివాస్,పిరిసంగుల శ్రీనివాస్ తిరుమల్ రెడ్డి,కోట శంకర్ మొదలగు వారు పాల్గొన్నారు.

## ఈపీ ఆపరేటర్ల బదిలీలపై హెచ్ఎంఎస్ ఆగ్రహం

**- యాజమాన్యం తీరుపై అనిల్‌రెడ్డి ధ్వజం**

నస్పూర్, జనవరి 24, ప్రభాతవార్త

సింగరేణి యాజమాన్యం అనుసరిస్తున్న అహేతుక బదిలీల వల్ల శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ఈపీ ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు వంటకాల అనిల్ రెడ్డి విమర్శించారు. శనివారం శ్రీరాంపూర్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఆయన డిప్యూటేషన్ల ప్రక్రియను తప్పుబట్టారు. శ్రీరాంపూర్ ఓసీపీ నుండి ఈపీ ఆపరేటర్లను ఇందారం ఓసీపీకి పంపిస్తూనే, ఆర్జీ2 ఏరియా ఈపీ ఆపరేటర్లను శ్రీరాంపూర్ రావాలని కోరుతూ సర్క్యులర్ జారీ చేయడం యాజమాన్యం ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. ఆర్జీ2 ఏరియా వారిని నేరుగా ఇందారం ఓసీపీకి పంపే అవకాశం ఉన్నా, శ్రీరాంపూర్ కార్మికులను కావాలనే వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ శ్రీరాంపూర్, ఇందారం నుండి 18 మందిని మణుగూరుకు పంపించి కార్మికుల కుటుంబాల్లో గందరగోళం సృష్టించారని గుర్తుచేశారు. సంస్థలో పైరవీకారుల జోక్యం పెరిగిందని, రికమండేషన్లు ఉన్న వారిని శ్రీరాంపూర్‌లోనే ఉంచుతూ సామాన్య కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ఎటువంటి ప్రణాళిక లేకుండా చేపడుతున్న ఈ బదిలీల వల్ల కార్మికులు మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతున్నారని పేర్కొన్నారు. యాజమాన్యం తన మొండి వైఖరిని వీడి కార్మికుల సమస్యలపై తక్షణమే స్పందించాలని అనిల్ రెడ్డి డిమాండ్ చేశారు.






## బెల్లంపల్లి ఏరియా ఉత్తమ ఉద్యోగులు ఎంపిక

తాండూర్, ప్రభాతవార్త :





బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి సాధన, విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్లు అధికార ప్రతినిధి పర్సనల్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ సింగరేణియన్ విజయ భాస్కర్ రెడ్డి (జిఎం, బెల్లంపల్లి ఏరియా), గండ్రాతి రమేష్ (హెడ్ ఓవర్ మెన్ ఖైరిగూడ ఓసి), బెస్ట్ అధికారిగా ఎం.కోటయ్య ఎస్ఈ (ఈఅండ్ఎం, గోలేటి సిహెచ్పి), ఏరియా స్థాయిలో ఉత్తమ ఎస్.కె.మదీనా బాషా (డీజీఎం సివిల్), ఏరియా స్థాయి లో ఉత్తమ ఉద్యోగులుగా ఇర్షాద్ బాబా (ఈపి ఆపరేటర్, ఖైరిగూడ ఓసి), గంగుల రామ్మోహన్ (ఈపి ఫిట్టర్, ఖైరిగుడ ఓసి), ఎన్. శ్రీనివాస్ రావు (హెడ్ చైన్ మెన్, సర్వే), బెస్ట్ సింగరేణియన్, బెస్ట్ అధికారిని ఈనెల 26న కొత్తగూడెంలో జరిగే గణతంత్ర దినోత్సవ ప్రధాన వేడుకల్లో సన్మానం చేస్తారు. బెల్లంపల్లి ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులను గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో జరిగే వేడుకల్లో సన్మానించి, జ్ఞాపికలను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

## పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తి అరెస్టు

లక్షెట్టిపేట, జనవరి 24, ప్రభాతవార్త

మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మాయమాటలు చెప్పి మోసం చేసిన గోదావరి రోడ్డుకు చెందిన చిక్రం సాయికిరణ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచడం జరిగిందని ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఒక మహిళకు తన భర్తతో విడాకులు కావడంతో కొద్దిరోజులుగా ఇంట్లో ఉండటాన్ని గమనించిన నిందితుడు తనకు తరచూ ఫోన్ చేస్తూ మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని ప్రేమిస్తున్నానని శారీరకంగా వాడుకొని బాధితురాలు పెళ్లి చేసుకోవాలని కోరడంతో పెళ్లికి నిరాకరించగా వాయిదాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ తరలించడం జరిగింది. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా మహిళల పట్ల, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఇబ్బందులకు గురిచేసిన ఎవరిని వదిలేది లేదు అని, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.



### పంచాయితీల అభివృద్ధిలో

# సర్పంచ్‌లదే ప్రధాన భూమిక

**- సర్పంచ్‌లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ కె. హరిత**



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె. హరిత



శిక్షణ ధృవపత్రం అందజేస్తున్న కలెక్టర్ హరిత

**కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త**

పంచాయితీల అభివృద్ధిలో సర్పంచ్‌లదే ప్రధాన భూమిక అని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంలో గల మైనారిటీ సంక్షేమ పాఠశాలలో పంచాయితీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ డివిజన్ లోని కాగజ్‌నగర్, దహేగాం, బెజ్జూర్, చింతల మానేపల్లి, కౌటాల మండలాలకు చెందిన సర్పంచ్ లకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్ లదే కీలక పాత్ర అని, గ్రామాలలో నెలకొన్న సమస్యలపై సర్పంచ్ లకు పూర్తి అవగాహన ఉంటుందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని, పంచాయితీలలో ఆదాయ వనరులు పెంచుకోవాలని, గ్రామాలలో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టే విధంగా పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామపంచాయతీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ప్రజలకు కనీస సౌకర్యాలు అందే విధంగా చూడాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, ఇందిరమ్మ ఇండ్లు పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేయాలని, గ్రామాలలో రైతులు ఒకే రకమైన పంట మాత్రమే కాకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించి ఆర్థిక అభివృద్ధి చెందేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పంచాయితీ విధులు, అధికారాలు, ప్రజా సంక్షేమంపై అందిస్తున్న ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, డివిజనల్ పంచాయతీ అధికారులు ఉమర్ హుస్సేన్, హరి ప్రసాద్, 5 మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, శిక్షకులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ధ్యానం, యోగా సాధనతో ఉత్తమ విద్యాభ్యాసం

**- ధనిక్ భారత్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విధార్థులకు అవగాహన సదస్సు**

**రామకృష్ణాపూర్, జనవరి 24, ప్రభాతవార్త**

ధ్యానం, యోగా సాధనతో ఉత్తమ విద్యాభ్యాసం సాధ్యమవుతుందని మేడం బాల లత మల్లవరపు అన్నారు. శనివారం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్.వి.ఆర్ గార్డెన్‌లో మంచిర్యాల ప్రాంతంలోని ప్రైవేట్ పాఠశాలల 9వ, 10వ తరగతి విద్యార్థుల కోసం ధనిక్ భారత్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక మోటివేషనల్ అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సుమారు 1500 విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలలత మాట్లాడుతూ, 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు అనవసర ఆందోళనకు గురికావద్దని సూచించారు. ఒత్తిడిని పక్కనపెట్టి ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే విజయమే లక్ష్యంగా నిలుస్తుందని తెలిపారు. ముఖ్యంగా పాత ప్రశ్నాపత్రాలను సాధన చేయడం ద్వారా పరీక్షా విధానంపై అవగాహన పెరిగి, భయం తొలగి ధైర్యం పెరుగుతుందని పేర్కొన్నారు.నేటి ఆధునిక యుగంలో విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, ఏఐ, మెటావర్స్, బిగ్ డేటా అనలిటిక్స్ వంటి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా సమానంగా అవసరమని ఆమె స్పష్టం చేశారు.విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ఉన్నత ఆశయాలను పెంపొందించుకుని, ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు వంటి ఉన్నత లక్ష్యాల సాధనకు ఇప్పటి నుంచే పునాదులు వేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారిని రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే తమ సంస్థ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ సదస్సులో మంచిర్యాల పట్టణానికి చెందిన పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసేలా ఇలాంటి కార్యక్రమం నిర్వహించడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ధనిక్ భారత్ డైరెక్టర్లు విక్రమ్ అజయ్, విక్రమ్ సురేంద్రబాబు, గిరిబాబు, ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షుడు ఉస్మాన్ పాషా పాల్గొన్నారు.





కౌన్సిలింగ్ ఇస్తున్న సైకాలజిస్ట్ ప్రకాష్ బనావత్

## ఒత్తిడిని జయిస్తే విజయం మీదే....

**ఆసిఫాబాద్, జనవరి 24, ప్రభాతవార్త:**

విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే విజయం మీ సొంతమవుతుందని కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ ప్రకాష్ బనావత్ అన్నారు. శనివారం మండలంలోని బాబాపూర్ లోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషనల్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షలు దగ్గరికొస్తున్న కొద్ది పిల్లల్లో అనేక రకాల ఒత్తిడి భయం పెరిగి చదివినది గుర్తుకు రాదని, తద్వారా పిల్లలు ఆందోళన చెందడం జరుగుతుందన్నారు. దీంతోపాటు ఆరోగ్యం క్షీణించడం, నిద్ర రాకపోవడం, ఎంత చదివినా గుర్తుకు రాకపోవడం జరుగుతుందని తెలిపారు. మానసిక శారీరక ఒత్తిడికి గురవడం వల్ల పరీక్షల్లో ఫెయిలవుతామనే భయం పెరిగి మరింత ఒత్తిడికి లోనవ్వడం వల్ల పరీక్షల్లో విఫలమయ్యే అవకాశం ఉంటుంద తెలిపారు. వీటన్నింటి నుండి బయటపడాలంటే అద్భుతమైన నాలుగు చిట్కాలు పాటించాలని సూచించారు. పీస్ , ప్లానింగ్, ప్రిపరేషన్, ప్రజెంటేషన్ ఈ నాలుగింటిని పాటిస్తే భయాన్ని ఓడించవచ్చుని పి ఫోర్ మంత్రాన్ని బోధించారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి పెట్టకుండా స్నేహపూర్వకంగా విద్యను బోధించినట్లయితే వారిలో మరింత మనో ధైర్యం పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల మనసులో ఎలాంటి ప్రశ్నలు ఉత్పన్నమైన వాటిని నివృత్తి చేసుకునేలా దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



అటవీ శాఖ అధికారులతో కళాశాల విద్యార్థులు

## జంతు గణనను విజయవంతంగా పూర్తిచేసిన ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

**ఉట్నూర్, జనవరి 24, ప్రభాతవార్త :**

గత ఐదు రోజుల నుండి ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అచల భారతీయ జంతు గణన (ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్2026) లో పాల్గొని ప్రతిరోజు ఉట్నూర్ అటవీ డివిజన్లోని వివిధ బీట్ల పరిధిలో సంచరించే జంతువుల పాదముద్రలను, వాటి మలవిసర్జనలను, తవ్విన ఆనవాళ్లను సేకరిస్తూ వాటి ఫోటోలు తీస్తూ ఎకాలజీ ఆప్ ద్వారా ఆన్లైన్లో క్రోడీకరించడం జరిగినది. వివిధ వన్య వృక్షాల ను, పొద జాతి మొక్కలను, ఔషధ మొక్కలను, కలుపు మొక్కలను కూడా లెక్కించడం జరిగినది. ఈ గణనలో పాల్గొనటం వలన ఫారెస్ట్ ఎకో సిస్టం గురించి దానిలోని బయోడైవర్సిటీ పై ప్రత్యక్ష అనుభూతిని పొందినామని విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ జంతు గణనలో ధైర్యంతో స్వచ్ఛందంగా పాల్గొన్న విద్యార్థులను వారికి మార్గదర్శనం చేసిన అధ్యాపకులను ఉట్నూర్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి అరవింద్, కళాశాల ప్రిన్సిపల్ టి. ప్రతాప్ సింగ్, బీర్సాయిపేట్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరుణ, వివిధ బీట్ల కు చెందిన బీట్ ఆఫీసర్స్ వారిని అభినందించారు. ఈ జంతు గణనలో వృక్ష, జంతు శాస్త్ర విభాగాల అధ్యాపకులు డా.ఎమ్. నర్సింగ్ రావు, ఎ. కరుణాకర్, కె. శ్రీకాంత్, డా. శ్రీనివాస్, ఏ రాజ్ కుమార్, టీ. ప్రజ్ఞ డి. స్ఫూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**ఆసిఫాబాద్, జనవరి 24, ప్రభాతవార్త:**



పురుగుల మందు తాగి ఒకరు మృతి చెందిన ఘటన ఆసిఫాబాద్ మండలంలో చోటుచేసుకుంది. శనివారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ బాలాజీ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ మండలం దస్నాపూర్ కు చెందిన వైరాగాడే రమేష్(52) గత రెండు సంవత్సరాల క్రితం నుండి కడుపు నొప్పితో భాద పడుతుండగా కుటుంబ సభ్యులు ఆపరేషన్ చేయించారు. కొన్ని రోజులు మంచిగా వుండి తర్వాత మళ్ళీ కడుపు నొప్పితో భాద పడుతూ మద్యానికి బానిసయ్యడు. మళ్ళీ ఆపరేషన్ అవుతుందేమోనని మనస్తాపం చెంది శుక్రవారం సాయంత్రం తన చేనులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. దీంతో అతడి నోటి నుంచి నురగలు రావడంతో కుటుంబ సభ్యులు గమనించి ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డ్యూటీ డాక్టర్లు తెలిపారు. మృతుడి భార్య సునంద బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు ఎస్హెచ్ఓ తెలిపారు.

## విద్యతోనే బాలికల సాధికారత

**పెంచికల్‌పేట్, జనవరి 24, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ బాలికల దినోత్సవాన్ని హెచ్‌ఎం విజయ నిర్మల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగహన కార్యక్రమంలో బాలికలకు చట్టాలు, సైబర్ నేరాలు, ఆర్థిక లావాదేవీలపై విస్తృతంగా అవగహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన లాయర్ గణపతి బాలికల హక్కులు, మహిళా రక్షణకు సంబంధించిన చట్టాలపై వివరించారు. అలాగే మండల విద్యాధికారి రమేష్ బాబు జాతీయ బాలిక దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ, బాలికలు విద్యతో పాటు ఆత్మవిశ్వాసన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామీణ బ్యాంక్ మేనేజర్ గోపి కిషోర్ ఆర్థిక లావాదేవీలు, పొదుపు అలవాట్లు బ్యాంకింగ్ సేవల ప్రాముఖ్యతను వివరించారు. కానిస్టేబుల్ శ్యామ్ సైబర్ నేరాలు, సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, భాష, గంగా భవాని, ఆత్మరాం, ఈశ్వర్, భారతి, ఉజ్వల, సంతోష్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# 75 ఏళ్లలో జరగని అభివృద్ధిని చేసి చూపిస్తా..

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు - కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు - సింగరేణి వాసులకు పట్టాల పంపిణీకి హామీ

**మంచిర్యాల, జనవరి 24, ప్రభాతవార్త**

మంచిర్యాల నియోజకవర్గంలో గత ఏడు దశాబ్దాలుగా పాలించిన వారు చేయని అభివృద్ధిని తన హయాంలో చేసి చూపిస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీకి చెందిన దాదాపు 200 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా మంచిర్యాలలో త్వరలోనే అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు.



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మాట్లాడుతున్న ప్రేమ్‌సాగర్‌రావు

సింగరేణి స్థలాల్లో నివసిస్తున్న కార్మిక కుటుంబాలకు రెండు నెలల కాలంలో శాశ్వత ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని 282 పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో ఆధునీకరించేందుకు 150 కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు సాగు, తాగునీరు, మౌలిక సదుపాయాల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. ఐబీ చౌరస్తా వద్ద 600 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల్లోని మోదెల, ద్వారక, గుడిరేవు, గూడెం గ్రామాల్లో 74.40 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నాలుగు మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంచిర్యాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ప్రతిపక్షాలకు ఓట్లు అడిగే అర్హత లేదని మండిపడ్డారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 60 సీట్లు సాధించి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఏ ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు భూమిపూజ

**నేరడిగొండ, జనవరి 24, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలంలోని బంధం రేగడి గ్రామ పంచాయతీ అభివృద్ధిలో భాగంగా గ్రామ పంచాయతీ భవనం, మండల ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ, పాఠశాల కిచెన్ షెడ్ నూతన నిర్మాణాలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివవారం భూమి పూజ చేశారు. గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి 22 లక్షలు, పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి 10 లక్షలు, పాఠశాల కిచెన్ షెడ్ నిర్మాణానికి 4 లక్షల రూపాయల వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న వివిధ సమస్యలను దశల వారీగా త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు టైలు, బెల్టులు, ఫేస్ ఐడి కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల సర్పంచులు, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సొంత ఖర్చులతో వీధి దీపాల ఏర్పాటు

**నెరడిగొండ, జనవరి 24, ప్రభాతవార్త:**

నెరడిగొండ మండలం బోరిగాం ప్రజల ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ రాథోడ్ వినీశ్ శనివారం తన సొంత ఖర్చులతో వీధిదీపాలను ఏర్పాటు చేశారు. రాత్రి సమయాల్లో చీకటి వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని, పారిశుద్ధం, తాగునీటి సరఫరా మెరుగునకు ప్రత్యేకంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు.

## గ్రామ దేవత ఆలయాల పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు

**సారంగాపూర్, జనవరి 24, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో బోనాల పండుగను పురస్కరించుకొని గ్రామ దేవత ఆలయాల పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో గల గ్రామ దేవతలకు ఆదివారం బోనాలు వేస్తారని తెలిపారు. గ్రామ దేవత ఆలయాలకు వెళ్లే రోడ్లు చెత్తాచెదారంతో నిండిపోవడంతో సర్పంచ్ బల్గురి అజయ్, ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ట్రాక్టర్ సహాయంతో శుభ్రం చేశారు. ప్రతి ఆలయ పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలను తొలగించి భక్తులకు ప్రశాంత వాతావరణం కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, గ్రామ పెద్దలు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.





## సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు నిధులు పెంచాలి

**జన్నారం, జనవరి 24, ప్రభాతవార్త**

సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాల ఆరాధ్య దైవం. అతను హిందూ ధర్మం గొప్పతనాన్ని బంజారాలకు తెలియజేయడానికి జన్మించిన మహానుభావుడుగా భావిస్తారు. అతను ఒక భారతీయ సామాజిక సంస్కర్త అలాగే సమాజ నాయకులు. అందుకే బంజారాలు తనను సమాజ గురువుగా గౌరవిస్తారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 15వ తేదీన జరిగే సంత సేవాలాల్ మహారాజు యొక్క జయంతి ఉత్సవాలకు నిధులు పెంచాలని తెలంగాణ బంజారా యువజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో శనివారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 33 జిల్లాలకు అరకొరగా నిధులు కేటాయిస్తున్నారని ఉత్సవాల నిర్వహణకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నుంచి ప్రతి జిల్లాకు ఐదు లక్షల చొప్పున 33 జిల్లాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అత్యధిక జనాభా ఉన్న గిరిజన లంబాడీల కొరకు మరియు ప్రభుత్వం ఆయా జిల్లా కేంద్రాలలో బంజారా బహు నిర్మించి బంజరుల యొక్క చరిత్రను మ్యూజియం ద్వారా భవిష్యత్తు తరాలకు అందించే కార్యక్రమం ఏర్పాటు చేయాలని సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో ముద్రించి రాబోయే బంజారా విద్యార్థులకు అందించే విధంగా చర్యలు చేపట్టాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం మండల అధ్యక్షులు ఉత్సవ కమిటీ అధ్యక్షులు నందు నాయక్, సర్పంచ్ సక్రు నాయక్ ధర్మో నాయక్, తిమ్మాపూర్ సర్పంచ్ రవి నాయక్, సర్పంచ్ దినేష్ నాయక్ మండల సంఘం నాయకులు రాములు నాయక్, బద్రి నాయక్, మోహన్ నాయక్, సర్పంచ్ దినేష్ నాయక్ ఉత్సవ కమిటీ నాయకులు నందు నాయక్, నాయకులు శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## స్ట్రీట్ వెండింగ్ జోన్ ప్రారంభించిన మంత్రి

**రామకృష్ణాపూర్, జనవరి 24, ప్రభాతవార్త**

ప్రజా సంక్షేమంలో భాగంగా రామకృష్ణాపూర్ పట్టణంలో శనివారం కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి, క్యాతన్ పల్లి మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో స్ట్రీట్ వెండింగ్ జోన్ (వీది వ్యాపరుల సముదాయాన్ని) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హాయంలో క్యాతన్‌పల్లి పురపాలకం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఇటీవల సుమారు 30కోట్ల రూపాయలతో పలు వార్డులలో రోడ్లు, డ్రైనేజిల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. 40కోట్ల రూపాయలతో సురక్షిత త్రాగు అందించుటకు ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌లను నిర్మిస్తున్నట్లు తెలియజేశారు. మౌళిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారని అన్నారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు,మాజీ చైర్ పర్సన్ జంగం కళ, నాయకులుగోపతి రాజయ్య, డీ కొండ శ్యామ్ గౌడ్, గాండ్ల సమ్మయ్య, నీలం శ్రీనివాస్ గౌడ్,యాకుబ్ అలీ, ఒడ్నాల శ్రీనివాస్, పోలం సత్యం,మెట్ట సుధాకర్, గోపతి బానేష్, పాల రాజయ్య,మహంకాళి శ్రీనివాస్, మహిళా నాయకులు పార్వతి విజయ పాల్గొన్నారు.

## గ్రామ సంఘ భవనానికి భూమి దానం

**తాండూర్, జనవరి 24, ప్రభాతవార్త**

మండలంలోని చంద్రపల్లి గ్రామ సంఘం భవన నిర్మాణానికి చంద్రపల్లి గ్రామం చంద్రోదయ గ్రామ సంఘం అధ్యక్షురాలు పెండ్యాల చంద్రకళ సొంత స్థలాన్ని దానం చేసినట్లు ఏపిఎం శ్యామల తెలిపారు. స్థలాని దానం చేసిన చంద్రకళను శనివారం ఏపిఎం, మండల సమాఖ్య ఈసీ సభ్యులు శాలువాతో సన్మానించి అభినందించారు.





మాట్లాడుతున్న రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సి ఈ ఓ దివ్య దేవరాజన్

## అత్యంత నిరుపేదలను గుర్తించి మౌలిక సదుపాయాలు కల్పించాలి

**ఆసిఫాబాద్, జనవరి 24, ప్రభాతవార్త:**

అత్యంత నిరుపేదలను గుర్తించి మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సిఈఓ దివ్య దేవరాజన్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి గృహ నిర్మాణ సంస్థ ఎండి గౌతమ్ తో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కుమ్రంభీమ్ ఆసిఫాబాద్, వికారాబాద్, నారాయణపేట్, నాగర్ కర్నూల్, ములుగు జిల్లాల కలెక్టర్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంత లక్ష్మిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత నిరుపేదలను గుర్తించి వారికి ఆధార్ కార్డు, సామాజిక పింఛన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డులు, బ్యాంకు ఖాతా, పిల్లల విద్య, పక్కా గృహాలు, ప్రతి ఇంటికి త్రాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్ల వివరాలను పరిశీలించి వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా నిరుపేదలు ఎదుర్కొంటున్న వ్యాధులను గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని, ప్రతి ఇంటికి త్రాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఆహార భద్రత కార్డులు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని, ఉపాధి హామీలు జాబ్ కార్డులు లేని వారిని గుర్తించి కార్డులు అందించడంతో పాటు 100 రోజుల పని దినములు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త అనిల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

**ఆసిఫాబాద్, జనవరి 24, ప్రభాతవార్త:**

మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటనకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్ లతో కలిసి జిల్లాలో జరగనున్న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానభవనరుల అభివృద్ధి కేంద్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్ అధికారుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఈ నెల 24వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరగనున్నందున సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సర్వీస్ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలను సందర్శించి జిల్లా భౌగోళిక చరిత్ర, పలు విషయాలపై వివరాలు తెలుసుకుంటారని, వారికి అవసరమైన సమాచారాన్ని అధికారులు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీ నారాయణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్, శిశు సంక్షేమ, అటవీ శాఖల అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హరిత

# గూగుల్ మీట్ ద్వారా జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ విద్యార్థులకు అందించిన సహకారం ప్రశంసనీయం

**- అక్షరమాల చైర్మన్ డా. ఎంఎస్ఆర్ మూర్తి - అక్షరమాల 5వ వార్షికోత్సవంలో కటుకం మధుకర్‌కు బెస్ట్ సర్వీస్ అవార్డు ప్రధానం**

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 24, ప్రభాతవార్త**




కటుకం మధుకర్‌కు బెస్ట్ సర్వీస్ అవార్డు ప్రధానం చేస్తున్న అక్షరమాల చైర్మన్ డా. ఎంఎస్ఆర్ మూర్తి

తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ విద్యా సహకారం అందిస్తున్న అక్షరమాల సంస్థ 5వ వార్షికోత్సవ కార్యక్రమం శనివారం సాయంత్రం ఐఐటీ హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పాఠశాల విద్యాశాఖ పరిధిలో అక్షరమాల కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడంలోను, మాస్టర్ మైండ్స్ కార్యక్రమము ద్వారా విశేష సేవలందించిన జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. అక్షరదాన్, ఐఐటీ హైదరాబాద్, ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ సంయుక్తంగా చేపట్టిన అక్షరమాల కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఎస్ఎస్‌సీ విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ జిల్లా విద్యార్థులకు అందించిన సహకారం ప్రశంసనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్షరమాల చైర్మన్ డా. ఎంఎస్ఆర్ మూర్తి చేతుల మీదుగా కటుకం మధుకర్‌కు బెస్ట్ సర్వీస్ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి హాజరయ్యారు. గ్రామ ప్రాంతాలలోని విద్యార్థులు అభివృద్ధి చెందినప్పుడే దేశము అభివృద్ధి చెందుతుందని వివరించారు. అక్షరమాల చైర్మన్ డాక్టర్ ఏ.ఎన్.ఆర్ మూర్తి మాట్లాడుతూ జిల్లా సైన్స్ అధికారి కటుకం మదూకర్ ఆధ్వర్యంలో నిర్వహించ బడుచున్న మాస్టర్ మైండ్స్ కార్యక్రమము ద్వారా గత 5 సంవత్సరాలుగా పదో తరగతి విద్యార్థులకు గూగుల్ మీట్ ద్వారా ఇస్తున్న శిక్షణ ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరడానికి మార్గము సులభమైందని పేర్కొన్నారు.



## నవ సమాజ అభివృద్ధికి ఓటు చాలా కీలకం

**దిలావర్‌పూర్, జనవరి 24, ప్రభాతవార్త:**

నవ సమాజ అభివృద్ధికి నీ ఓటు హక్కు చాలా కీలకమని ప్రిన్సిపల్ సుదర్శన్ అన్నారు. శనివారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు అధ్యాపకులు ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో బాధ్యతగా ఓటు వేయాలని, మద్యానుకో డబ్బుకు ప్రలోభాలకు అమ్ముకోకుండా ఓటు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మాలేపు కృష్ణ, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు ఉన్నారు.




## నూతన ఎస్సై శ్రీసాయి స్వాగతం పలికిన గ్రామస్థులు

**నార్నూర్, జనవరి 24, ప్రభాతవార్త:**

నార్నూర్ సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీసాయిను నార్నూర్ గ్రామస్తులు శాలువతో సన్మానించి స్వాగతం పలికారు. బదిలపై వెళ్తున్న ఎస్సై అఖిల్‌కు వీడ్కోలు పలికారు. ఎస్సై అఖిల్ హయాంలో శాంతి భద్రతలను గొప్పగా పరిరక్షి ంచారాని గజానంద్ నాయక్ అన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహమ్మద్ ఖురేషి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ షేక్ దాది అలీ, మాజీ జడ్పీటీసీలు జ్ఞానోబా పుష్కర్, బ్రిజు లాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవరావ్, దళిత రత్న నర్సింగ్ మోరే, మాడావి మాన్కు పటేల్, పేసా చైర్మన్ సికిందర్ రాథోడ్, కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వసంత్ ఆడే, చౌహన్ గోవింద్, దళిత రత్న కోర్రల మహేందర్, హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ సుల్తాన్ ఖాన్, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ ఫెరోజ్ ఖాన్, ఎంసి డైరెక్టర్ కైలాష్, వార్డ్ మెంబర్స్ మాడావి ఆనంద్ రావ్, రాథోడ్ సుధీర్, అఖిలేష్ గుంజ చిన్నయ, అర్క గోవింద్, షేక్ హుస్సేన్, షేక్ అహ్మద్, రాథోడ్ అశోక్, సూర్తికార్ అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర భూ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

**- సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్**

**వేమనపల్లి, జనవరి 24, ప్రభాతవార్త**

సమగ్ర భూ సర్వేతోనే భూ సమస్యలు పరిష్కారం అవుతాయని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని దస్నాపూర్ గ్రామ పంచాయతీలోని కొత్తపల్లి శివారులోని పాఠశాల ఆవరణలో తహసీల్దార్ సాయిబాబుతో కలిసి గ్రామ శివారు భూముల సమగ్ర సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం పాలన సమయంలో భూములన్నీ వారి ఆధీనంలోనే ఉండేవని, ఆ భూములు ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చాక సీలింగ్, ఇనాం, లావునిపట్టా, 38-ఈ, పట్టా భూములవంటి అనేక రకాలుగా విభజించి సర్వే, ఖాతా నంబర్లు ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఆ సమయంలో జరిగిన భూ మార్పుల్లో కొన్ని ఇబ్బందులు తలెత్తి ఇప్పటికి భూ సమస్యలు అలాగే కొనసాగుతూ న్యాయస్థానాల్లో కేసులు కొనసాగుతున్నాయన్నారు. క్షేత్ర స్థాయిలో ఆ భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా సమగ్ర భూ సర్వే నిర్వహించి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కూడా అన్ని పత్రాలను సరి చూసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. కొత్తపల్లి శివారులో చేపట్టే భూ రీ సర్వేకు రైతులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమారస్వామి, నాయబ్ తహసీల్దార్ సాయి క్రిష్ణ, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఖలీక్, స్థానిక సర్పంచ్ మడే శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ దుర్గం తిరుపతి, పంచాయితీ కార్యదర్శి రజిత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడి శ్రీనివాస్